ప్రజాశక్తి
శుక్రవారం 23 ఆగస్టు 2024
8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

ఉపాధికి ఊతమిచ్చేనా..?

- యాంత్రీకరణ, ఆక్వా విస్తరణతో తగ్గుతున్న వ్యవసాయ పనులు
- పారిశ్రామిక రంగంలోనూ కానరాని పురోగతి
- ఉపాధి చట్టం పనులే లక్షలాది కుటుంబాలకు దిక్కు
- నేడు ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

2024-25 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు గ్రామసభల నిర్వహణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా కృష్ణాజిల్లాలోని 479 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో శు

క్రవారం గ్రామసభలు జరగనున్నాయి. వ్యవసాయ అనుబంధ ఉపాధి పనుల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. దీనిలో 38 రకాల పనులను గుర్తించాల్సిందిగా సూచించింది. ఈ నేపథ్యంలో కృష్ణాజిల్లాలో వ్యవసాయ కార్మికులకు పూర్తి స్థాయిలో పనులు కల్పించేందుకు ఈ గ్రామ సభలు ఏ మేరకు ఉపయోగపతాయనేది చర్చనీయాంశమైంది.

వ్యవసాయ యాంత్రీకరణ, ఆక్వా విస్తరణతో వ్యవసాయ కార్మికులకు చేతినిండా పనులు దొరకడం కష్టంగా మారింది. యాంత్రీకరణ, ఆక్వా విస్తరణకు ముందు ఏడాదికి 130 రోజుల వరకు వ్యవసాయంలో కార్మికులకు పని దినాలు లభించగా ప్రస్తుతం ఆ పనులు 60 రోజులకు కుదించుకుపోయాయి. మరోపక్క కృష్ణాజిల్లాలో పారిశ్రామిక పురోగతి అంతంత మాత్రంగానే ఉంది. ఈ నేపథ్యంలో గ్రామీణ ఉపాధి పనులకు ఏటా డిమాండ్ (మిగతా 2లో)

గ్రామసభలను విజయవంతం చేయాలి

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన

ప్రజాశక్తి-విజయవాడ: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 23న అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గ్రామసభలను విజయవంతం చేసేందుకు గ్రామ,

మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.సజన అధికారులను ఆదేశించారు. గ్రామసభల నిర్వహణపై గురువారం క్యాంపు కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలను సుస్థిర అభివృద్ధి దిశగా నడిపించే దిశగా ప్రభుత్వం నిర్వహించే గ్రామసభలపై ప్రజల్లో అవగాహన పెంపొందించి, భాగస్వాములయ్యేలా ప్రోత్సహించాలన్నారు. మంచినీటి కుళాయిలు, మరుగుదొడ్లు, మంచినీటి సరఫరా వ్యవస్థ, డ్రెయినేజీ వ్యవస్థ, అంతర్గత రహదారులు, ఇతర గ్రామాలకు, పట్టణాలకు అనుసంధాన రహదారులు, వ్యర్థాల నిర్వహణ తదితరాలపై చర్చించాలన్నారు. గ్రామ అభివృద్ధి ప్రణాళిక (వీడీపీ)కు సంబంధించి రూపొందించిన రేఖా చిత్రాలను ప్రదర్శించాలని, గ్రామసభల్లో అర్థవంతమైన చర్చ జరిగేలా కృషి చేయాలని అన్నారు. మహాత్మాగాంధీ (మిగతా 2లో)

ఈ ఏడాది 7 లక్షల ఇళ్ల నిర్మాణం

- కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు
- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి

ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం, మైలవరం

ఈ ఏడాది ఏడు లక్షల ఇళ్లను నిర్మించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, కాలనీల్లో అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గాజుల ఎట లేఅవుట్, ఈలప్రోలు వద్ద నిర్మిస్తున్న పక్కా గృహాల లేఅవుట్, జి.కొండూరు, మైలవరం మండలం పురాగుట్ట లేఅవుట్‌లను గురువారం స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్, గృహ నిర్మాణ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ అజయ్ జైన్‌లతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 2016 నుండి ఇప్పటివరకు పేదలకు 21 లక్షల గృహాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. లబ్ధిదారులుకు సహాయ సహకారాలు అందించడంలో వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కేవలం (మిగతా 2లో)

కిడ్నీ బాధితులను ఆదుకోండి

- రేపు ఎ.కొండూరులో ధర్నా
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు, డివి కృష్ణ

ప్రజాశక్తి-విజయవాడ

ఎన్‌టిఆర్ జిల్లాలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారిని అదుకోవాలని, లేకపోతే బాధితుల తరపున సమస్య పరిష్కారమయ్యేంత వరకు పోరాడతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు హెచ్చరించారు. గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో గురువారం సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి ఆంజనేయులు, కోటా కళ్యాణ్, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్‌లతో కలిసి బాబూరావు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కిడ్నీ బాధిత మృతుల వివరాల జాబితాను నాయకులు విడుదల చేశారు. అనంతరం బాబూరావు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ జిల్లాలోని ఎ.కొండూరు, గంపలగూడెం తదితర మండలాల పరిధిలోని గ్రామాల్లో రోజురోజుకు ప్రజారోగ్యం క్షీణిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మరో ఉద్దానంలా తయారైన ఎ.కొండూరు ప్రాంతంలో గత పదేళ్ల కాలంలో 300 మంది కిడ్నీ వ్యాధితో చనిపోయారని, జిల్లా వ్యాప్తంగా మరో 500 మంది వరకు కిడ్నీ వ్యాధితో మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు. కిడ్నీ వ్యాధి బారిన పడి (మిగతా 2లో)

ఆలస్యంగా ఆర్థిక సంఘం నిధులు

- కృష్ణాలో 479 పంచాయతీలకు రూ.9.46 కోట్లు జమ
- నిధులకు దూరంగా 18 పంచాయతీలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీలకు కేంద్రం నాలుగున్నర నెలల ఆలస్యంగా విడుదల చేసింది. తాజాగా జిల్లాలోని 278 పంచాయతీల పబ్లిక్ ఫండ్ మేనేజ్‌మెంట్ సిస్టం (పిఎఫ్ఎంఎస్) ఖాతాల్లో రూ. 9,46,45,400 పంచాయతీల్లో జమయ్యాయి. విడుదలైన నిధుల్లో టైడ్ గ్రాంటు 50 శాతం నిబంధనలు ప్రకారం తాగునీటి అవసరాలకు, పారిశుద్య నిర్వహణకు వినియోగించాలి. మరో 50 శాతం అన్ టైడ్ నిధులను పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. వీటితోపాటు జిల్లా పరిషత్, 25 మండల పరిషత్‌లకు మరో రూ. 6 కోట్లు నిధులను కేంద్రం విడుదల చేసింది.

ఆలస్యంగా నిధులు విడుదల

గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయడంలో గత వైసిపి ప్రభుత్వంతో పాటు కేంద్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఆర్థిక సంఘం నిధులు ప్రతి ఏటా రెండు విడతలుగా కేంద్రం పంచాయతీలకు జమ చేయాలి. రెండో దఫా నిధులు 2024 మార్చి చివరిలోపు విడుదలవ్వాలి. ఎన్నికలు కోడ్ కారణాన్ని చూపుతూ ఎన్నికలు అయ్యే వరకు ఆలస్యం చేసింది. ఎన్నికలు పూర్తయి నూతనంగా ప్రభుత్వ ఏర్పడిన తర్వాత 75 రోజుల తర్వాతే కేంద్రం నిధులు విడుదల చేసింది. దీంతో శానిటరీ, తాగునీటి నిర్వహణ, మౌలిక వసతుల కల్పనకు సంబంధించి పంచాయతీలు సకాలంలో బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం నిధులు విడుదలతో పంచాయతీల్లో చేసిన వర్కులకు (మిగతా 2లో)

ప్రతి ఇంటికి కుళాయి సర్వే : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: ప్రతి ఇంటికి ఉన్న కుళాయి సర్వేను సత్వరమే పూర్తి చేసి, నివేదికను వెంటనే అందజేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం అధికారులతో మాట్లాడుతూ ప్రతి ఇంటికి కుళాయి సర్వేను సత్వరమే పూర్తి చేసి నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ప్రస్తుతం జరుగుతున్న ప్రతి ఇంటికి త్రాగునీటి కుళాయి సర్వే లో భాగంగా సచివాలయం సెక్రటరీలు ప్రతి ఇంటికి వెళ్లి చేస్తున్న త్రాగునీటి కుళాయి సర్వేను వేగవంతం చేయాలని, సర్వేలో ఎటువంటి ఉడుదుడుకులు లేకుండా ఖచ్చితమైన నివేదికను నమోదు చేయాలని, విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 2,33,131 అసెస్మెంట్లకు గురువారం మధ్యాహ్నం 1,86,638 అసెస్మెంట్ల సర్వే పూర్తయిందని, దాదాపు 80 శాతం సర్వేని పూర్తి చేశారని, ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి వంద శాతం సర్వేను సత్వరమే పూర్తి చేసి నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

మొదటిపేజీ తరువాయి

ఉపాధికి ఊతమిచ్చేనా..?

పెరుగుతోంది. కృష్ణాజిల్లాలో 2,11,546 జాబ్ కార్డుల్లో 1,40,043 జాబ్ కార్డుదారులకు ఉపాధి పనులకు వెళుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో (2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు) కృష్ణాజిల్లాలో 76 లక్షల పని దినాలు లక్ష్యంగా నిర్ణయించారు. 59.61 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. దీనికి రూ.155.60 కోట్లు వేతనం చెల్లించారు. మిగిలిన పని దినాలు వచ్చే 2025 జనవరి, ఫిబ్రవరి మార్చి నెలల్లో పూర్తవుతాయని జిల్లా అధికారులు చెబుతున్నారు. అయితే ఉపాధి చట్టం ప్రకారం గ్రామీణ పేదలకు ఏడాదిలో వంద రోజులు పని కల్పించాల్సి ఉండగా జిల్లాలో సగటున ఒక్కో జాబ్ కార్డుకు 42.57 పనిదినాలు మాత్రమే ప్రభుత్వం కల్పించింది. వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు కేవలం 5,562 మాత్రమే ఉన్నాయి.

పనులు గుర్తింపు ఇలా!

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొత్తగా ఫీడర్ కాలువలు నిర్మించడం, కొత్త పంట కాలువ నిర్మాణం, పొలం గట్లపై మొక్కల పెంపకం, రైతుల భూముల్లో ఫార్మ్‌ఫాండ్, వ్యక్తిగత భూముల అభివృద్ధి , కోళ్లు, పశువులు, గొర్రెలు, షెడ్లు, పట్టుపురుగల షెడ్లు, ప్రభుత్వ స్థలాల్లో కందకాలు, వ్యక్తిగత పండ్లు, పూల తోటల పెంపకం తదితర పనులను గుర్తించాల్సి ఉంది.

గ్రామసభలను విజయవంతం చేయాలి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద చేపట్టేందుకు గుర్తించిన పనులపై చర్చించి, ఆమోదం తీసుకునేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి సమగ్ర ప్రణాళికల రూపకల్పనకు ఈ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ జె.సునీత, డీపీవో ఎన్‌వీ శివప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా ఆర్థిక సంఘం నిధులు

బిల్లులు చెల్లించడానికి చాలని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి దఫా నిధులను సెప్టెంబర్‌లోపు విడుదల చేయాల్సి ఉంది. ఈ నిధులను కేంద్రం సకాలంలో విడుదల చేస్తే పంచాయతీలకు ఒకింత ఊరట కలుగుతుంది.

18 పంచాయతీలకు గ్రాంటు దూరం

సకాలంలో ఎన్నికలు నిర్వహించిన పంచాయతీలకు మాత్రమే ఈ నిధులు విడుదలవుతాయి. జిల్లాలో మచిలీపట్నం కార్పొరేషన్‌లో విలీన ప్రతిపాదనలతో తొమ్మిది పంచాయతీలకు, మండల కేంద్రం గుడ్లవల్లేరు పంచాయతీలో విలీన ప్రతిపాదనలతో మూడు పంచాయతీలకు, గుడివాడ మున్సిపాల్టీలో విలీన ప్రతిపాదనలతో ఆరు గ్రామాలకు ఎన్నికలను నిర్వహించలేదు. అయితే ప్రతిపాదిత పట్టణాలు మేజర్ పంచాయతీల్లో ఈ పంచాయతీలను విలీనం చేయలేదు. ఈ 18 నాలుగు సంవత్సరాలుగా ఆర్థిక సంఘం నిధులు విడుదల కాలేదు. మరోపక్క మున్సిపాల్టీలు, మేజర్ పంచాయతీల్లోనూ విలీనం చేయలేదు. దీంతో నిధులు లేక ఈ పంచాయతీల్లో కనీస పౌర సేవలు అందని దుస్థితికి చేరిపోయాయి.

నేటి నుంచి ఇసుక బుకింగ్‌కు ప్రత్యేక కేంద్రాలు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: త్వరలో కొత్త ఇసుక విధానం రానుందని ఈలోగా ప్రస్తుత ఉచిత ఇసుక విధానాన్ని మరింత సమర్ధవంతంగా అమలుచేసేందుకు గౌరవ ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందని, ఈ నెల 23వ తేదీ శుక్రవారం నుంచి స్టాక్ పాయింట్ల వద్ద బుకింగ్‌కు వీలుండదని, ప్రత్యేకంగా ఇసుక బుకింగ్‌కు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన వెల్లడించారు. ఉచిత ఇసుక విధానం నూతన మార్గదర్శకాలపై జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, డీసీపీ కేఎం మహేశ్వరరాజు, ఏసీపీ డా. రవికిరణ్‌తో కలిసి గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కీసర స్టాక్ పాయింట్ (కంచికచర్ల మండలం)కు కంచికచర్ల-3 గ్రామ సచివాలయంలోనూ, మొగులూరు స్టాక్ పాయింట్ (కంచికచర్ల మండలం)కు చెవిటికల్లు గ్రామ సచివాలయంలోనూ, అనుమంచిపల్లి స్టాక్‌పాయింట్ (జగ్గయ్యపేట మండలం)కు షేర్‌మొహమ్మద్‌పేట పంచాయతీ కార్యాలయంలో, పోలంపల్లి స్టాక్ పాయింట్ (వత్సవాయి మండలం)కు పోలంపల్లి గ్రామ సచివాలయంలోనూ ఇసుక బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. రెవెన్యూ, పోలీస్, మైన్స్ శాఖల అధికారులు ఇప్పటివరకు చోటుచేసుకున్న పరిణామాలను విశ్లేషించి, ఈ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. జిల్లాలో జులైలో ఎనిమిది స్టాక్ పాయింట్లతో ఉచిత ఇసుక విధానం ప్రారంభంకాగా ప్రస్తుతం నాలుగు స్టాక్ పాయింట్లలో ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. ఈ బుకింగ్ కేంద్రాలు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తాయన్నారు. AP.Mines.Gov.in వెబ్‌సైట్లో రిజిస్టర్ అయిన వాహనాలకు మాత్రమే బుకింగ్ చేయడం జరుగుతుందని, అదే విధంగా ఇన్‌వాయిస్ లేని వాహనాలను స్టాక్‌పాయింట్ల వద్దకు అనుమతించడం జరగదన్నారు. ట్రాన్స్‌పోర్టు ఛార్జీలను, హ్యాండ్లింగ్ ఛార్జీలను బుకింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించడం జరుగుతుందని.. ఒక వినియోగదారునికి రోజుకు 20 మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే అందించడం జరుగుతుందన్నారు. డీసీపీ (రూరల్) కేఎం మహేశ్వరరాజు మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం పటిష్ట అమలుకు చర్యలు తీసుకోవడం జరిగిందని.. అదనపు చెక్‌పోస్టులతో నిఘాను పెంచామని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

జిల్లా పరిధిలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జాతీయ రహదారులు, రైల్వేలకు సంబంధించి వివిధ ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్‌హెచ్-165 జీ- గ్రీన్ ఫీల్డ్ అలైన్‌మెంట్, ఎన్‌హెచ్‌ఏఐ-216హెచ్ (పెడన-విసన్నపేట), ఎన్‌హెచ్-16 (బెంజ్ సర్కిల్ సర్వీస్ రోడ్డు), ఎన్‌హెచ్-65 (నందిగామ-కంచికచర్ల బైపాస్), ఎన్‌హెచ్-221 (విజయవాడ-భద్రాచలం), ఎన్‌హెచ్-65 (విజయవాడ-హైదరాబాద్ సెక్షన్)లకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియపై చర్చించారు. భూ సేకరణ విస్తీర్ణం, అవార్డు పాస్ వివరాలతో పాటు ప్రస్తుతం ప్రక్రియ ఏ దశలో ఉందనే వివరాలను పరిశీలించారు. ప్రక్రియ ఎంతమేర పూర్తయింది? మిగిలిన ప్రక్రియను పూర్తిచేసేందుకు ఏవైనా సమస్యలున్నాయా? వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలు తదితరాలపై ఆయా ప్రాంతాల ఆర్‌డీవోలు, తహసీల్దార్లతో చర్చించారు. నిర్దేశ గడువులోగా భూ సేకరణ ప్రక్రియను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా రైల్వేలో బీజీ లైన్లు, ఆర్‌వోబీలు, డబ్లింగ్ పనులు తదితరాలకు సంబంధించి భూసేకరణకు ఇప్పటివరకు వచ్చిన అభ్యర్థనలు, రావాల్సిన వాటిపైనా సమావేశంలో చర్చించారు.

పరిశ్రమల్లో భద్రతా చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-విజయవాడ

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు సేఫ్టీ ఆడిట్ నిర్వహించి పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని, చట్టాలను ఉల్లంఘించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 18 మంది కార్మికుల ప్రాణాలు బలిగొన్న అచ్యుతాపురం ఎషన్షియా యాజమాన్యాన్ని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. ఫ్యాక్టరీల్లో సేఫ్టీ ఆడిట్ చేయాలని కోరుతూ శుక్రవారం విజయవాడ, జిల్లాలోని పారిశ్రామిక కేంద్రాల్లో ధర్నాలు చేయాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ పరిశ్రమల్లో ఈ కాలంలో పెద్ద సంఖ్యలో ప్రమాదాలు జరిగి కార్మికులు దుర్మరణం చెందారని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా కంపెనీలు నడుపుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇస్తున్నాయని పేర్కొన్నారు. కానీ ఇందులో పనిచేస్తున్న కార్మికులకు కనీస భద్రత కల్పించడంలేదని విమర్శించారు. జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామంలోని అల్ట్రాటెక్ సిమెంట్స్ కర్మాగారంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో ఐదుగురు కార్మికులు మృతిచెందగా, మరో 11 మంది తీవ్ర గాయాలపాలయ్యారని తెలిపారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ప్రమాదాలు జరిగినప్పుడే హడావిడి చేస్తున్నారు తప్ప వాటి నివారణకు ఫ్యాక్టరీ శాఖ అధికారులు గానీ, ప్రభుత్వం కానీ ఎలాంటి చర్యలూ చేపట్టడంలేదని పేర్కొన్నారు.

కిడ్నీ బాధితులను ఆదుకోండి

చికిత్స పొందుతున్న వారు మరో రెండు వేల మందికి పైగా ఉండగా, తిరువూరు నియోజకవర్గంలోని ఏ కొండూరు, గంపలగూడెం మండలాల్లోనే వెయ్యి మంది వరకు ఉన్నారని తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఎ.కొండూరు మండలంలోని ఒకే ప్రాంతంలో ఇప్పటి వరకు 63 మంది మృత్యువాతపడ్డారని చెప్పారు. జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం లోపించి, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారై రోగాలు ప్రబలుతున్నాయని, 30 శాతం గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు విషజ్వరాలకు లోనై అవస్థలు పడుతున్నారని అన్నారు. శుద్ధి చేసిన కృష్ణా నీరు అందుబాటులో లేక ఎ.కొండూరు మండలంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వందకు పైగా మద్యం బెల్టు షాపులు ఉన్న ఎ.కొండూరు మండలంలో మంచినీరు అందుబాటులో ఉండకపోవడం దారుణమన్నారు. ఎ.కొండూరు, గంపలగూడెం, తిరువూరు, విసన్నపేట, మైలవరం తదితర మండలాల పరిధిలోని గ్రామాల్లో నీటిలో ఫ్లోరైడ్, సిలికాన్ ప్రమాణం ప్రమాదకరస్థాయిలో ఉండి, భూగర్భ జలం విషతుల్యం అవుతూ, తప్పనిసరి పరిస్థితుల్లో బోరు నీటిని తాగుతూ వందలాది మంది కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికయినా కిడ్నీ వ్యాధికి గల కారణాలు, మృతుల పరిస్థితిపై ఒక నిపుణుల బృందంతో సమగ్రంగా ప్రభుత్వం పరిశోధన చేయించాలని డిమాండ్ చేశారు. తక్షణమే కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను నిర్మించాలని, శుద్ధి చేసిన నీటిని కుళాయిల ద్వారా అందించాలని, క్రియాటిన్ రెండు పాయింట్లు, ఆపైన ఉన్న వారందరికీ వైద్యం, మందులు అందించాలని, డయాలసిస్ పేషెంట్లకు ఇస్తున్న పెన్షన్‌ను రూ.20 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ మాట్లాడుతూ సిపిఎం బృందాలు ఆయా ప్రాంతాల్లో గత వారం రోజుల పాటు పర్యటించి, తాజా పరిస్థితులపై అధ్యయనం చేశాయన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులను అదుకోవాలని కోరుతూ ఈ నెల 24న ఎ.కొండూరులో నిర్వహించే ధర్నాలో బాధిత ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ ఏడాది 7 లక్షల ఇళ్ల నిర్మాణం

6.8 లక్షల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా కాలనీల ద్వారా నిర్మిస్తున్న గృహాలను 2025 నాటికీ పూర్తి చేయాలన్న సంకల్పంతో టిడిపి ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. పట్టణ ప్రాంతాలలో అమత్ నిధులు, గ్రామీణ ప్రాంతాలలో ఉపాధిహామీ జలజీవన్ మిషన్ నిధుల ద్వారా మౌలిక వసతులను కల్పించనున్నామన్నారు. ప్రసుత్తం పేదలకు మంజూరు చేసిన గృహాలను రానున్న మార్చి నాటికీ పూర్తి చేయకపోతే కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు విదులయ్యే అవకాశం ఉండదని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు రావాలన్నారు. అర్హత లేనివారికి ఇళ్లు మంజూరు చేసినట్లు ఫిర్యాదులు వస్తున్నాయని వాటిపై పూర్తి విచారణ చేసి రద్దు చేస్తామని మంత్రి తెలిపారు. ఇబ్రహీంపట్నం, ఈలప్రోలు కాలనీలలో ఇళ్ల నిర్మాణంలో బేస్మెంట్‌ని నింపుకునేందుకు స్థానిక శాసనసభ్యులు సహకారంతో విటిపిఎస్ ఫ్లైయాష్‌ను లబ్దిదారులకు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం గాజులపేటలో 33 ఎకరాలలో 1406 గృహాలు, ఈలప్రోలు సమీపంలో 12.97 ఎకరాలలో 709 గృహాలు, జి.కొండూరు సమీపంలో 12.42 ఎకరాలలో 360 గృహాలు, మైలవరం సమీపంలోని పురాగుట్ట వద్ద 33.85 ఎకరాలలో 1147 గృహాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. మంజూరైన గహాలలో ఒక వంతు మాత్రమే పూర్తయ్యాయని మిగిలిన గహాల నిర్మాణం చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ జీవి ప్రసాద్, జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ రజినికుమారి, డీఈ శ్రీనివాసరావు, ఏఈ సిహెచ్ నాగరాజు, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన, ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, స్థానిక నాయకులు జంపాల సీతారామయ్య, రామినేని రాజా, చెన్నుబోయిన చిట్టిబాబు, సిహెచ్ శ్రీనివాసరావు, డి. విజయలక్ష్మి, అక్కల గాంధీ పాల్గొన్నారు.

PASSPORT LOST

The General Public is hear by informed that I **Mohammed Soubhan, S/o Mohammed Usman Ruknuddin** Age :40 Years, D.No.6-17-4, 4th Floor, Munnaluri Vari Street, Opp. Raj Yuvaraj Theatre, Gandhi Nagar, Vijayawada, NTR District, Andhra Pradesh-520003. A.P., Lost my passport Bearing no.**G6172623** Issued at Banglore lost my original passport while traveling from Raj yuvaraj Theatre to Modern Foods, Mogalrajapuram,vja and inspite of my best efforts I am unable to trace it and it is lost beyond recovery. If any body find please inform me on above address. **Cell : 8121111999**

పేరు మార్పు

నేను N.Ch.L.S.A. మంగతాయారు D/o నల్లమల్లి శ్రీనివాసరావు, W/o గజవల్లి జయప్రవేష్, నివాసం డి.నెం. 27-23-143, గోపాలరెడ్డి రోడ్డు, గవర్నరు పేట, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్.

నాయొక్క UTI బాండ్ పేపరు (UTI Bond Paper) లో నా యొక్క పేరు N.Ch.L.S.A. మంగతాయారు అని తప్పుగా వ్రాయడం జరిగింది. ఇప్పుడు నా యొక్క పేరు మార్పు చేసిన తర్వాత నా కొత్త పేరు **గజవల్లి చరిష్మా** W/o **గజవల్లి జయప్రవేష్** గా మార్పు చేయడం జరిగినది. కావున నేటి నుండి నా పేరు **గజవల్లి చరిష్మా** W/o **గజవల్లి జయప్రవేష్ (GAJAVALLI CHARISHMA, W/o GAJAVALLI JAYA PRAVESH)** గా పిలవబడును.

దస్తావేజులు పోయినవి

కోడూరు మండలం, వి.కొత్తపాలెం గ్రామానికి చెందిన సనకా వెంకట బ్రహ్మారావు, తండ్రి : చెంచయ్యకు చెందిన పొలం దస్తావేజు పోయినవి. అవనిగడ్డ మండల పరిధిలోని దక్షిణ చిరువోలు లంక రెవెన్యూ పరిధిలోని ఆర్.ఎస్.నెం. 361/5లో య. 1.90 సెంట్లలో నా తాలూకా య.1.06 సెంట్లు శేరి మెరకభూమి ఒరిజినల్ దస్తావేజు నెం. 3038/1987 కు చెందిన దస్తావేజు పోయినవి. ఇటీవల తమ గ్రామం వి.కొత్తపాలెం నుండి అవనిగడ్డకు దస్తావేజులు ఫొటోస్టాట్ తీయించే నిమిత్తం వస్తుండగా మార్గమధ్యం లో పడిపోయినవి. ఎవరికైనా దొరికిన యెడల దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగలరు. లేదా తన ఫోన్ 97056 88156కు ఫోన్ చేసి చెప్పగలరు.

ఇట్లు

సనకా వెంకట బ్రహ్మారావు, తండ్రి : చెంచయ్య,
వి.కొత్తపాలెం, కోడూరు మండలం, కృష్ణాజిల్లా.
సెల్ నెం : **97056 88156**

పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం అమలు

- కృష్ణాజిల్లా ఇంచార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో కొత్త ఇసుక విధానం అమలు చేయనున్నదని, ఈలోగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రస్తుత ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. ఉచిత ఇసుక విధానం నూతన మార్గదర్శకాలపై ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు తో కలిసి గురువారం కలెక్టరేట్లో మీకోసం సమావేశపు హాలులో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ కష్ణాజిల్లాలో పర్యావరణ మార్గదర్శకాలు ఎన్ జి టి ఆదేశాల ప్రకారం ఇసుక రీచ్ లు పనిచేయడం లేదని, కావున ఇసుక స్టాక్ లేదని అన్నారు. అయితే

మాట్లాడుతున్న గీతాంజలి శర్మ

కష్ణజిల్లా వాసులకు సమీపంలో ఎన్టీఆర్ జిల్లా పరిధిలో గల నాలుగు ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక బుకింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని, ఈ కేంద్రాల వద్ద నుండి జిల్లా వాసులు ఇసుక పొందవచ్చని తెలిపారు. కీసర స్టాక్ పాయింట్- కంచికచర్ల-3 గ్రామ సచివాలయంలోనూ, కంచికచర్ల మండలం చెవిటికల్లు గ్రామ సచివాలయంలోనూ, జగ్గయ్యపేట మండలం షేర్‌మొహమ్మద్‌పేట పంచాయతీ కార్యాలయంలో, పోలంపల్లి స్టాక్ పాయింట్- (వత్సవాయి మండలం)కు పోలంపల్లి గ్రామ సచివాలయంలోనూ ఏర్పాటు చేసిన ఇసుక బుకింగ్ కేంద్రాల వద్ద జిల్లా వాసులు ఇసుక బుకింగ్ చేసుకోవచ్చని ఇంచార్జ్ కలెక్టర్ తెలిపారు. బుకింగ్ సమయంలోనే స్లాట్ కేటాయిస్తామన్నారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) నిర్ధారించిన రవాణా ఛార్జీలను మాత్రమే అనుమతిస్తామన్నారు. రవాణా చార్జీలు అధికంగా వసూలు చేసినా, ఇతరత్రా ఏవైనా ఫిర్యాదులు చేయాల్సి వస్తే 1800-599-4599 (రాష్ట్ర స్థాయిలో) 1800-425-6026 (కష్ణాజిల్లా) టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, జిల్లా గనుల శాఖ అధికారి కొండారెడ్డి పాల్గొన్నారు.

కృష్ణకుమారిని సన్మానిస్తున్న దృశ్యం

'స్వచ్ఛ చల్లపల్లి'తోనే జాతీయ స్థాయి గుర్తింపు : సర్పంచ్

ప్రజాశక్తి-చల్లపల్లి : స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమంతోనే గ్రామ పంచాయతీకి జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి అన్నారు. ఇటీవల పంద్రాగస్టు వేడుకల్లో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి నుండి జాతీయ స్థాయి గుర్తింపు, సన్మానం అందుకున్న సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారికి పంచాయతీ కార్యాలయ ఆవరణలో పౌర సన్మానం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కష్ణకుమారి మాట్లాడుతూ గత పదేళ్లుగా గ్రామంలో డాక్టర్ డీ.ఆర్.కె ప్రసాద్ - డాక్టర్ టీ.పద్మావతి దంపతులు, స్వచ్ఛ కార్యకర్తలు నిర్విరామంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం కారణంగానే చల్లపల్లి గ్రామానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించినట్లు తెలిపారు. చల్లపల్లి గ్రామాన్ని పారిశుద్ధ్య పరంగా అత్యంత శుభ్రంగా ఉంచే ప్రయత్నంలో భాగస్వాములవుతున్న ప్రతి ఒక్కరికీ సర్పంచ్ ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కష్ణకుమారి - రాజేంద్ర దంపతులను స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ - డాక్టర్ టీ.పద్మావతి, ఎంపీపీ కోట విజయరాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీడీవో చేకు చిన రాట్నాలు, ఈ.ఓ.ఆర్.డీ బూరేపల్లి అశోక్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నబీఘోరి, పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, ఇంచార్జి ఆర్ఐ ఘంటసాల కష్ణమోహన్, పంచాయతీ ఈవో పీవీ మాధవేంద్రరావు స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు ఘనంగా సత్కరించారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-గుడివాడ : హెచ్ఐవి లైంగికంగా సంక్రమించే అంటువ్యాధి అని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్ పి లక్ష్మణ్ నాయక్ అన్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో గ్రామంలో 'మీకు తెలుసా...?' బేతవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం, ర్యాలి నిర్వహించారు. సూపర్ వైజర్ బి రాకేష్ మాట్లడుతూ 2017 యాక్ట్ ప్రకారం హెచ్ఐవి సోకినావారిని ఎవరైనా చులకనగా చూడటం గాని హేళన చేయడం గాని చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1097కి కాల్ చేయవచ్చు అని చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు జి సంధ్య రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముసుగు దొంగలతో జాగ్రత్తగా ఉండాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-కోడూరు : యూపీ నుంచి ముసుగు దొంగలు వచ్చినట్లు సమాచారం ఉందని, అవనిగడ్డ నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవనిగడ్డ డిఎస్‌పి మురళీధర్ తెలిపారు. గురువారం కోడూరు పోలీస్ స్టేషన్ వద్ద పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేటప్పుడు ఇంటి తాళాలు ఇంటి వద్ద ఉంచకుండా జాగ్రత్తవహించుకోవాలని, వీలైనంతవరకు ఇంటి వద్ద వ్యాపార సముదాయాల వద్ద, భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. స్మార్ట్ ఫోన్ వినియోగదారులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులు సోషల్ మీడియా ద్వారా పంపిన లింకులను ఓపెన్ చేయొద్దని, వారు పంపే అశ్లీల చిత్రాలకు వీడియోలకు అట్రాక్ట్ ఐ మోసపోవద్దని సూచించారు. పేకాట, కోడిపందాలు నిర్వహించిన , మద్యం ,రేషన్ బియ్యం, అక్రమ ఇసుక రవాణా, అక్రమ ఇసుక నిల్వల ఉంచిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇల్లీగల్ యాక్టివిటీస్ నిర్వహించే వారి సమాచారాన్ని ప్రజలు పోలీసు వారికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ సీఐ జి.యువ కుమార్, కోడూర్ ఎస్సై పి.శిరీష పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అవనిగడ్డ డిఎస్‌పి మురళీధర్

వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడులో సిపిఎం ఆధ్వర్యంలో కేరళ వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగారావు మాట్లాడుతూ కేరళ రాష్ట్రం వయనాడ్ ప్రాంతంలో జరిగిన ప్రకతి విలయ తాండవానికి అనేక మంది మృత్యువాతపడడం తోపాటు వందలాది ఇళ్ళు నేలమట్టం అయ్యాయన్నారు. వారిని ఆదుకునేందుకు కంకిపాడులో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టామని, అనేకమంది దాతలు ముందుకు వచ్చి ఉదారంగా విరాళాలు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వి. శివశంకర్, జి కుమారి, సిహెచ్ శ్రీహరి, ఎం చంటిబాబు, వి మరియదాసు, వి జాన్ మోజేష్, జె రవి వేమూరి నాగేశ్వరరావు, వి వెంకటేశ్వరరావు, కె. నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరులో ఎరువుల షాపుల్లో తూనికలు, కొలతల అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. అసిస్టెంట్ కంట్రోలర్ టి. రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యలో ఆశాఖ ఉద్యో గులు ఎరువుల బరువు తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎరువుల బరు వు నిర్ధిష్టంగనే ఉందన్నారు. తూకం తేడా కన్పిస్తే జరిమానాతో పాటు చట్టపరమై న చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎరువుల షాపులో తూకం పరిశీలిస్తున్న తూనికలు కొలతల అధికారి

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలో అక్ర మంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గురువారం తెల్లవారు జామున పట్టుకున్నామని ఎస్సై అర్జున్‌రాజు తెలిపారు. రొయ్యూరు గ్రామానికి చెందిన ముగ్గురికి చెందిన మూడు ఇసుక ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక లోడ్ చేసుకుని వెళుతుండగా గురువారం తెల్లవారు జామున ఏనుగులకోడు వంతెనవద్ద పట్టుకున్నామని వీటిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపించామన్నారు. వీటితోపాటు మరో మూడు ఇసుక ట్రాక్టర్లను గతంలో పట్టుకున్నామని మొత్తం ఆరు ఇసుక ట్రాక్టర్ల పై కేసు నమోదు చేసి కోర్టుకు పంపించామన్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని, పేకాట కోడిపందాలు వంటివి నిర్వహించిన ఆడిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెక్ బౌన్స్ కేసులో వ్యక్తికి జైలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : చెక్ బౌన్స్ కేసులో నిందితునికి ఒక సంవత్సరం జైలుశిక్ష, రూ.99వేలు జరిమానా విధిస్తూ ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీహరి గురువారం తీర్పునిచ్చారు. అడ్వకేట్ టి.చంటిబాబు తెలిపిన వివరాల ప్రకారం కానూరుకు చెందిన ఆరేపల్లి శ్రీనివాసరావు తాడంకి గ్రామానికి చెందిన సిద్ధినేని బసవరాజు నుంచి 11-10-2016లో లక్ష రూపాయలు అప్పుగా తీసుకుని 22-9-2018న రూ.65వేలకు చెక్కుఇవ్వగా బ్యాంకు లో నగదు చెల్లింపు కాలేదు. బసవరాజు చెక్కుబౌన్స్ కేసు వేయగా శ్రీనివాసరావుకు ఒక సంవత్సరం జైలుశిక్ష, రూ.99 వేలు జరిమానా విదిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

మాట్లాడుతున్న సిఐ మురళీకృష్ణ

మత్తు పదార్థాలతో జీవితం నాశనం : సిఐ

ప్రజాశక్తి-కంకిపాడు : గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలతో యువత జీవితం నాశనమవుతుందని కంకిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళీకృష్ణ అన్నారు. కంకిపాడు గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థులకు మత్తు పదార్థాల అనా ర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు సక్రమమైన నడవడిక కలిగి ఉండాలని, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు చెప్పిన విషయాలు పాటించా లన్నారు. గంజాయి మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ప్రతి గ్రామంలోని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, వాటి ద్వారా పర్యవేక్షణ మరింత పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు ఎస్ఐ సందీప్, హైస్కూలు హెచ్ఎం భాగ్య లక్ష్మి , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే సిఐ మురళీ కృష్ణ, కంకిపాడు ఎస్ఐ డి.సందీప్, సిబ్బంది మండలంలోని కుందేరు, కోలవెన్ను గ్రామాలను సందర్శించి అక్కడ ప్రజలకు శాంతిభద్రతలు, సైబర్ నేరాలు, దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

వైద్యురాలి మృతిపై నిరసనలు

ప్రజాశక్తి - విజయవాడ : వైద్యురాలి మృతి పట్ల విద్యార్థుల, ఉద్యోగుల, డాక్టర్ల నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల నుండి బిఎస్‌ఎన్‌ఎల్ వరకు, తిరిగి కళాశాల వరకు ఆయా కళాశాలలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా కమిటీల అధ్వర్యంలో జరిగిన ఈ మహార్యాలీలో వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, సమగ్ర విచారణ జరిపించాలని విద్యార్థులు చేసిన నినాదాలు హోరెత్తాయి. అనంతరం ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల వద్ద బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ కలకత్తా ఆర్‌జి కర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల జూనియర్ డాక్టరుపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన పట్ల దేశ వ్యాప్తంగా అట్టడుకి పోతుంటే నేటికీ దేశ ప్రధాని స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇటువంటి ఘటనలు జరగకూడదని డాక్టర్లు, ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, అన్ని తరగతుల ప్రజలు రోడ్డు మీదకొచ్చి కలకత్తా ఘటన పట్ల నిరశిస్తుంటే... ఈ దేశ ప్రధాని కనీసంగా మాట్లాడకపోవడం అత్యంత దారుణమని మండిపడ్డారు. సుప్రీంకోర్టు ఈ ఘటనను సుమోటోగా తీసుకొని అత్యున్నత ఒక కమిటీ ద్వారా దర్యాప్తు చేయిస్తుందన్నారు. ఆడపిల్లలకు, మహిళలకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళా డాక్టరుపై అత్యాచారం, హత్య దుర్మార్గమైన సంఘటన అని అన్నారు. జూనియర్ డాక్టర్, ఎండి జనరల్ మెడిసిన్ చందన మాట్లాడుతూ చిన్న పిల్లల నుంచి పెద్దల వార్త వరకూ మహిళలకు రక్షణ లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లాకార్యదర్శి వెంకటేశ్వరరావు, ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల మహిళా కోఆర్డినేటర్ అరుణ, ఎస్‌ఎఫ్‌ఐ కళాశాల కమిటి నాయకులు కుమారస్వామి, జ్వలిత, చిన్నారి, భార్గవ్, అవినాష్, మధు, పృథ్వీ, ఐద్వా నాయకులు షకీల, ఆశ, విద్యార్థులు పాల్గొన్నారు. **వన్‌టౌన్ :** దేశంలో రోజు రోజుకీ పెరుగుతున్న మహిళల హత్యలు, అత్యాచారాలు అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని సిపిఎం ఫ్లోర్ లీడర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బోయి సత్యబాబు తెలిపారు. ఇటీవల కోల్‌కతాలో జరిగిన వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ బుధవారం రాత్రి వన్‌టౌన్ చిట్టూరు కాంప్లెక్స్ వద్ద కొవ్వొత్తుల నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా బోయి సత్యబాబు మాట్లాడుతూ కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన సామూహిక అత్యాచారం, హత్యను ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ నిరసనలో సిఐటియు పశ్చిమ నగర అధ్యక్షులు జి.వెంకట్రావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వి.సాంబులు, యూనియన్ నాయకులు నరసింహారావు, ఆదిలక్ష్మి, దుర్గ, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు. జక్కంపూడి వైఎస్‌ఆర్ కాలనీ సచివాలయం వద్ద మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.సాంబశివరావు, దుర్గ, బుజ్జి, చిన్ని, యోహాన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ చిట్ట అమర్ సుధీర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలి శాస్త్రి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు ప్ల కార్డులతో ర్యాలీ నిర్వహించారు. సమాజంలో స్త్రీలపై జరుగుతున్న హింసలకు నిరసనగా, స్త్రీలకు ప్రత్యేకమైన సంరక్షణ చట్టాలను ఏర్పాటుచేసి వాటిని తక్షణమే అమలయ్యే ప్రాతిపదికన చట్ట సవరణలు చేయాలని పలు నినాదాలతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కళాశాలలోని రోటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ అర్షిత్ భరద్వాజ్, క్లబ్ సెక్రటరీ అచ్యుత, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలో రోటరాక్ట్ క్లబ్ విద్యార్థులతో కలిసి ఈ ర్యాలీ నిర్వహించారు. వన్‌టౌన్‌లోని పంజా సెంటర్ నుండి చిట్టినగర్ సెంటర్ వరకు వందమందికి పైగా విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి, ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌ఆర్‌ఆర్ కె.సాకేత్, రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ రాయల్ సిటీ, విజయవాడ మిడ్‌టౌన్ రోటరాక్ట్ క్లబ్, రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ పివిపి సిద్ధార్థ కాలేజీ, ఎపి జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్, ఎన్‌సిసి స్వయంగా పాల్గొని నిరసనలు తెలిపారు. **జగ్గయ్యపేట** జగ్గయ్యాపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు ప్రాంగణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ నూతన చట్టాల అమలు ద్వారా నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నెపాగ సుందరరావు, బత్తుల వెంకటరామయ్య, కాసరగడ్డ నాగేశ్వరావు, కరణం నరసింహారావు, ఏజిపి టిఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న రమాదేవి, కళాశాల విద్యార్థినులు, తదితరులు

జక్కంపూడి వైఎస్‌ఆర్ కాలనీలో నిరసన

జగ్గయ్యపేటలో న్యాయవాదుల నిరసన

కార్పొరేటర్‌కు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 52వ డివిజన్‌లో దోమల వ్యాప్తి అధికంగా ఉందని, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, సంబంధిత మున్సిపల్ అధికారులు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) కోరారు. బుధవారం కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు చంటి నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో డెంగీ దోమల నివారణ చర్యలు గురించి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి బయాలజిస్ట్ సూర్యనాయక్ పాల్గొని పూల కుండీలలో నీరు, చెత్త నిల్వ ఉన్నాయా లేదా అని పరీక్షించారు. డెంగీ దోమను కనుగొని ప్రజలకు చూపించారు. ఈ సందర్భంగా జియాలసిస్ట్ సూర్యనాయక్ మాట్లాడుతూ ఇళ్ళల్లో పాత తోట్లలో, కొబ్బరి చిప్పలు, వాడని డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. లేదంటే దోమల లార్వా వది చెందటం వలన మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలుతాయని తెలిపారు. కార్పొరేటర్ చంటి మాట్లాడుతూ చెత్తను బయట పడవేయకుండా, మున్సిపాలిటీ సిబ్బంది వచ్చినప్పుడు అందించాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

కిడ్నీ సమస్యలపై రాజీలేని పోరాటం

ప్రజా శక్తి - ఏ.కొండూరు : మండలంలో అంటు వ్యాధిలా వ్యాపిస్తున్న కిడ్నీ వ్యాధి సమస్యపై సిపిఎం రాజీలేని పోరాటం చేస్తుందని కిడ్నీ బాధితుల సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యేవరకు తమ పోరాటం ఆగదని సిపిఎం మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఐదో రోజు గిరిజన ప్రాంతాల్లో కిడ్నీ వ్యాధుల సమస్యలపై పర్యటన చేస్తున్న సిపిఎం బృందం చీమలపాడు పెద్ద తండా దిప్ల నగర్ తండా మన్సింగ్ తండా అడ్డ రోడ్డు తండాలలో పర్యటించి కిడ్నీ బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ నెల 24న కిడ్నీ బాధితుల సమస్యలపై తహశీల్దార్ కార్యాలయం జరిగే ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొనీ అర్జీల ద్వారా తహశీల్దార్ తెలియజేయాలని సూచించారు. చిన్న, పెద్ద వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరిని ఈ వ్యాధి పట్టిపీడిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు పి.ఆనందరావు, సోమేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి, వన్‌టౌన్

శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనార్థం జమ్మూ, కాశ్మీర్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కమిషనర్ సతీష్ చంద్ర దంపతులు గురువారం ఆలయానికి విచ్చేశారు. ఏర్పేడులోని శ్రీ వ్యాసాశ్రమం పీఠాధిపతి శ్రీ పరిపూర్ణనంద గిరి స్వామీజీ వారు గురువారం విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వీరికి వేదపండితులు వేద స్వస్తి పలుకగా ఆలయ అధికారులు శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం మరియు చిత్రపటంను అందజేశారు.

సతీష్ చంద్ర దంపతులకు చిత్రపటం ఇస్తున్న ఆలయ అధికారులు

అనుమతి లేకుండా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం

ప్రజాశక్తి - కంచికచర్ల : రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవ లేనట్లు, రాజకీయ పలుకుబడి, అదీ అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండదండలుంటే నిబంధనలకు తూట్లు పొడిచి డబ్బు ఎలాగైనా సంపాదించవచ్చు అనే ట్రెండ్ సమాజంలో నడుస్తోంది.

కంచికచర్లలో విజయవాడ రోడ్డలో రహదారి పక్కనే ఏడాది క్రితం అప్పటి ప్రభుత్వం అండతో ఎలాటి అనుమతులు లేకుండా వెంచర్ వేసి ప్లాట్లు అమ్ముతున్నారు. అనుమతులు లేని ఆ వెంచర్లో జాతీయ రహదారి పక్కనే సుమారు 25 సెంట్ల స్థలంలో నందిగామకు చెందిన బిల్డర్లు సిండికేట్‌గా ఏర్పడి పివిఆర్ కాంప్లెక్స్ పేరుతో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. ఈ ఏడాది జూన్ 9న రంగు రంగుల బ్రోచర్ చూపించి మొత్తం 25 షాపుల నిర్మాణం చేస్తున్నట్లు చూపించారు. ఆ కాంప్లెక్స్‌లో రోడ్డు ఫేజ్‌లో 5 షాపులు ఒక్కొక్కటి 25 లక్షలు, వెనక 20 షాపులు ఒక్కొక్కటి 16 లక్షలు ధర నిర్ణయించారు. కస్టమర్లను పిలిచి ఒక్కో షాపునకు నాలుగో వంతు డబ్బు కట్టి ఎగ్రిమెంట్ రాయించుకుంటేనే షాపులు మీ పేరుతో ఉంటాయన్నారు. దీంతో అప్పులు చేసి ఒక్కొక్కరుగా ఎగ్రిమెంట్ చేయించుకున్నారు. ఒకరిద్దరు కస్టమర్లు కాంప్లక్స్ అనుమతుల గురించి ఆడిగారు. వారు నిర్మాణం చేపట్టే కాంప్లెక్స్ రెసిడెన్షియల్ కోసమని అనుమతులు కోరుతూ గ్రామ పంచాయతీకి దరఖాస్తు చేశారు. అయితే అనుమతుల కోసం దరఖాస్తు చేసినవారు కనీసం పంచాయితీకి చెల్లించాల్సిన చలానా కూడా కట్టలేదు. తర్వాత కాంప్లక్స్ నిర్మాణ తీరును పరిశీలించిన పంచాయతీ అధికారులు, రెసిడెన్షియల్ కోసమని ప్లాన్ చూపించి, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చూసి ఇచ్చిన అనుమతులను రద్దు చేశారు. రద్దు చేసిన కాపీనే ఇదే అనుమతుల కాపీ అని బిల్డర్ కష్టమర్లను మభ్యపెట్టారు. గురువారం ఇరువురు కస్టమర్లు ఎగ్రిమెంట కోసమొచ్చి కాంప్లెక్స్ నిర్మాణ తీరును చూసి ఆశ్చర్యపోయారు. కాంప్లెక్స్ నిర్మాణ అనుమతులు అడిగారు. దీంతో సదరు బిల్డర్ సిండికేట్ దారులు ఫేక్ కాగితాలు చూపించి ఇవే అనుమతులన్నారు. తాము అధికార పార్టీకి చెందిన వారము, అనుమతులు లేకపోయినా కాంప్లక్స్ నిర్మాణం ఆపే దమ్ము, ధైర్యం ఎవరికీ లేదని, మీ ఇష్టమైతే ఎగ్రిమెంట్ చేసుకోండి, లేకపోతే లేదు. మీరిచ్చిన అడ్వాన్స్ డబ్బులు కూడా ఇవ్వం మీకు చేతనైనది చేసుకోండి అంటూ కస్టమర్లపై దాడికి యత్నించారు. తాము మంత్రి లోకేష్ మనుషులం, తమ కాంప్లెక్స్‌కు అనుమతులతో పనిలేదని బెదిరిఅంచారు.. దీంతో కస్టమర్లు భయాందోళనకు గురయ్యారు.

కాంప్లెక్స్ నిర్మాణం నిలిపివేయాలని సీఆర్డిఏ నోటీసులు

కాంప్లెక్స్ నిర్మాణ పనులు నిలిపివేయాలని గురువారం సీఆర్డిఏ అధికారులు నోటీసులు అంటించారు. అనుమతులు లేకుండా నిర్మాణం చేపడితే తదుపరి చర్యలు చేపడతామని నోటీసులో పేర్కొన్నారు.

ఎగ్రిమెంట్లు రద్దు చేసుకునే యోచనలో కస్టమర్లు..

కాంప్లెక్స్‌లో షాపులు కొనుగోలు చేసిన కస్టమర్లు ఎగ్రిమెంట రద్దు చేసుకోవటానికి సిద్ధమౌతున్నారు. లక్షలాది రూపాయలు పెట్టి షాపు కొనుగోలు చేశాక, తర్వాత ఎప్పుడో అధికారులు వచ్చి బిల్డింగ్‌కు అనుమతులు లేవని కూల్చితే అన్యాయం అవుతామని ఓ కష్టమర్ ఆవేదన వ్యక్తం చేశాడు. అన్ని నిబంధనల ప్రకారం అనుమతులు ఉంటేనే మిగతా డబ్బులు చెల్లించి షాపులు రిజిస్ట్రేషన్ చేయించుకుంటామని, లేకపోతే మా డబ్బులు వెనక్కి తీసుకుంటామని కస్టమర్లు అంటున్నారు.

నిర్మాణంలో ఉన్న కాంప్లెక్స్


కాంప్లెక్స్‌కు సిఆర్‌డిఏ అధికారులు అంటించిన నోటీసులు

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

• రాజకీయ నాయకుల పేరుతో సాగుతోన్న దోపిడీ

మట్టి తవ్విన దృశ్యం

మట్టి తోలిన స్థలం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం అల్లాపురం పరిధిలో ఉన్న ఆర్ అండ్ ఆర్ స్థలాల్లో ఉన్న మట్టి అక్రమ తవ్వకాలకు అడ్డే లేకుండా పోతుంది. అక్రమ సంపాదనకు అలవాటు పడిన కొంతమందికి ఎర్ర మట్టి కాసుల వర్షం కురిపిస్తుంది. రాజకీయ నాయకుల పేరు చెప్పుకొని ఈ అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరిగిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో ప్రోక్లైన్ పెట్టి మట్టి తవ్వేస్తున్నారు. పగటిపూట యంత్రం తీసుకువెళ్లి పక్కనే ఉన్న పొలాల్లో పెట్టేస్తున్నారు. ఈ తవ్వకాలకు అనుమతులు లేవని రెవెన్యూ అధికారులు చెబుతున్నా గాని మట్టి యథేచ్ఛగా తరలిపోతుంటే చర్యలు తీసుకునే నాధుడే కరువయ్యాడని విమర్శిస్తున్నారు. విచిత్రం ఏమంటే మట్టి తరలిస్తున్న సమయంలో రెవెన్యూ అధికారులు ట్రాక్టర్లను పట్టుకున్నారు. మట్టి తరలిస్తున్న వ్యక్తి మంత్రి పీఏ నుండి ఫోన్ చేయించడంతో వదిలేసారని తెలిసింది. నిజం చెప్పాలంటే ఆ ఫోన్ మంత్రి పీఏది కాదట. ఏదో ఒక నెంబర్తో ఆ విధంగా చెప్పించి ట్రాక్టర్లు పట్టుకోకుండా అక్రమ తవ్వకందారుడు తప్పుకున్నాడని తెలుస్తోంది. ఇతను పోలీసులను కూడా బురిడీ కొట్టించాడని సమాచారం. ఎంతో విలువైన ఎర్ర బంగారం ఇప్పటికే ఆక్రమార్కుల పాలైన విషయం అందరికీ తెలిసినదే. అయినా ప్రభుత్వం చూసి చూడనట్లుగా వదిలివేయడు విచారించదగిన విషయం. సంబంధిత శాఖ అధికారి కూడా పర్యవేక్షణ లేకుండా పోయింది. అక్రమార్కులకు మట్టిని అమ్ముకొని జేబులు నింపుకుంటున్నారని వాదన ఉంది. మట్టి దొంగలకు రాజకీయ నాయకులు దారులు తెరిచినట్లుగా ఈ వ్యవహారం ఉందని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టుపక్కల ప్రాంతంలో గత రెండు నెలలుగా ఈ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని, జగన్ ఇళ్ళ పేరుతో దర్జాగా ప్రైవేటు స్థలాలకు రబ్బీసును తరలించకపోయి దండీగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తవ్వకం దారులు గ్రామాల పరిధిలోని అధికారులను మేనేజ్ చేసుకుంటున్నారని విమర్శ ఉంది. ఈ విషయమై ఓ గ్రామస్థాయి అధికారికి ఫోన్ చేయగా మట్టి తవ్వకు పోయారని స్థానికుల నుంచి ఫిర్యాదు వచ్చిన మాట నిజమే అన్నారు. ఇకపై జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇంకో అధికారిని అడిగితే అనుమతుల గురించి మాకు ఏం తెలియదు అన్నట్టు మాట్లాడారు. ఇప్పటికైనా ఈ మట్టి దొంగలపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. ఈ అక్రమ తవ్వకాలపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడానికి గ్రామాల జనాలు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

14న జాతీయ లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక

ప్రజాశక్తి-కలక్టరేట్ (కష్ణా) : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు సెప్టెంబర్ 14 న జరిగే జాతీయ లోక్ అదాలత్లో కక్షి దారులు తమ తమ కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక ఓ ప్రకటనలో తెలిపారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు, ఏలూరు జిల్లాలోని నూజివీడు, కైకలూరు కోర్టుల పరిధిలో ఈ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని, ఈ సందర్భంగా రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద క్లైములు మరియు సివిల్ కేసులు రాజీ చేసుకొనవచ్చని తెలిపారు. కనుక కక్షి దారులు తమ లాయర్లను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మచిలీపట్నం, విజయవాడ, గుడివాడ, నూజివీడు, నందిగామ, అవనిగడ్డ, కైకలూరు, గన్నవరం, తిరువూరు, జగ్గయ్యపేట, బంటుమిల్లి, మైలవరం, ఉయ్యూరు మరియు మొవ్వ కోర్టుల ఆవరణలో ఈ జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు.

రాత్రి వరకు తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : రాత్రి ఎనిమిది గంటలకు వరకు ప్రత్యేక తరగతుల నిర్వహిస్తున్న ప్రైవేట్ అండ్ కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు వి. కీర్తి అన్నారు. మచిలీపట్నంలో రాత్రి వరకు తరగతులు నిర్వహిస్తున్న కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా కమిటీ ఉపాధ్యక్షులు కీర్తి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన మచిలీపట్నం, జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఒక పాఠశాల కూడా విద్యా శాఖ ఉత్తర్వులు అమలు చేయడం లేదని అన్నారు. ఉదయం 7:45 నిమిషాల నుండి రాత్రి 8 గంటలకు వరకు ప్రత్యేక తరగతుల పేరుతో క్లాసులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ అండ్ కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి ప్రత్యేక తరగతులు పేరుతో సాయంత్రం 8 గంటల వరకు తరగతులు నిర్వహించడం ప్రతి సంవత్సరం పరిపాటిగా మారిందన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మచిలీపట్నం పట్టణ కమిటీ నాయకులు ప్రదీప్, సాయి, జయకర్, బసీమ్, సాయి రాం తదితరులు పాల్గొన్నారు.

తరగతులు నిర్వహిస్తున్న కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నూకాలమ్మ జాతర ప్రారంభం

ప్రజాశక్తి-మోపిదేవి: మండల పరిధిలోని రావివారిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఘటం బిందె ఊరేగింపు కార్యక్రమం గురువారం ఘనం గా ప్రారంభించారు. శ్రావణమాసం సందర్భంగా కష్ణానదిలో స్నానం చేయించి మోపిదేవి పురవీధుల్లో ఊరేగింపుగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రావివారిపాలెం నవీన్ నగర్ చెందిన రజకులు అమ్మవారి ఘటం బిందుని మోస్తూ పోతురాజు కర్ర, డప్పు వాయిద్యములతో అత్యంత వైభవంగా కార్యక్రమం నిర్వహించారు. మోపిదేవి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ రావి బాబురావు అమ్మవారికి ప్రత్యేక పూజ నిర్వహించారు. గొరిపర్తి అంతిరాజు దంపతులు వారి ఇంటి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు రజకులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలి : ఐసిఇయు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ చర్యలు కల్పించాలని ఐసిఇయు డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్ కుమార్ డిమాండ్ చేసారు. వివిధ రంగాల్లో పని చేస్తున్న మహిళలపై పలు చోట్ల జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులను ఖండిస్తూ మచిలీపట్నం లోని స్థానిక ఎల్.ఐ.సి ఉద్యోగులు గురువారం డివిజనల్ ఎల్.ఐ.సి కార్యాలయం వద్ద ఇన్సూరెన్సు కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఐ సి ఇ యు ప్రధాన కార్యదర్శి కిషోర్ మాట్లాడుతూ 'ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కోట్లాది మంది మహిళలు పని చేస్తున్నారన్నారు. యాజమాన్యాల ఒత్తిడి మేరకు, రాత్రి వేళల్లో కూడా మహిళలు పని చేయాలని చట్టాలు తెచ్చారని, కానీ వారి రక్షణకు ఎటువంటి నిర్దిష్టమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. చట్టాలను అమలు చేస్తున్న తీరు అత్యంత ఘోరంగా ఉందన్నారు. కార్మిక మంత్రిత్వ శాఖ వైఖరి నిర్లక్ష్యంగా ఉందన్నారు.కలకత్తాలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం చేసి ఆమెను హత్య చేసిన ఘటన దేశ ప్రజలను నిర్ఘాంత పరిచిందన్నారు. దుర్మార్గమైన, హేయమైన ఈ చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ మహిళలకు తమ పని ప్రదేశాల్లో భద్రత కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె. సుధాకర్, టి. చంద్రపాల్, ల్. రాజశేఖర్, వై. స్వామినాధ్, బి హెచ్. మాధుర్, ఎస్ వి రత్నారావు, ఏజెంట్స్ యూనియన్ నాయకులు క్. రాజారావు,ఉదయ లక్ష్మీ,ఉద్యోగులు పాల్గొన్నారు.

చిన్నారులతో దేవరపల్లి సురేష్ బాబు

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : చీకటి పడితే వీధి దీపాలు కింద నివసించే చిన్నారులకు వెలుగులు ఇవ్వాలని ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు అధికారులను కోరారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీలో సంత మార్కెట్ కొరకు పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన షెడ్లలో నివాసం ఉంటున్న చెంచుల కుటుంబాలను గురువారం సందర్శించి పిల్లల పరిస్థితిలను చూసి విచారం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో నివాసం ఉంటూ పాఠశాలలకు వెళుతున్న చిన్నారుల దయనీయ స్థితి తీవ్ర బాధాకరం గా ఉందన్నారు. ఆ చిన్నారులు రాత్రి పడుకునే సమయం వరకు వీధి దీపాల దగ్గర ఆడుకొని పొద్దు పోయాక నిత్యం కటికి చీకట్లో జీవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారు నివసిస్తున్న ఆవాసాల మధ్య చీకట్లో నిత్యం విషపు పురుగులు సంచరిస్తుం డటంతో భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. నిత్యం కటిక చీకట్లో దుర్భర జీవితం అనుభవిస్తున్న చిన్నారులకు పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు చేయూతనివ్వాలని కోరారు. వాళ్లకి స్థలాలు, ఇళ్లు ఇవ్వకపోయినా వాళ్లు నివసిస్తున్న చోట కనీసం కొన్ని లైట్లు అయినా ఏర్పాటు చేయాలని కోరారు. వాళ్ల సమస్యను ఎంపీడీవో చిన రాట్నాలు దష్టికి తీసుకు ని వెళ్ళగా పంచాయతీ ఈవో తో మాట్లాడి చిన్నారులకు కనీస వసతి కల్పించడానికి ప్రయత్నిస్తానని ఎంపీడీవో హామీ ఇచ్చినట్లు తెలిపారు.

గ్రామ సభలను జయప్రదం చేయండి : ఎండిఒ

ప్రజాశక్తి-పెదపారుపూడి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామపంచాయతీలను అభివృద్ధి పథంలో నడపడానికి మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు గుర్తించేందుకు ప్రత్యేక గ్రామసభలు గురువారం ఒకరోజు మాత్రమే జరుగుతున్నాయని ఎండిఒ సీతామహాలక్ష్మి అన్నారు. గతంలో ఆమోదం పొందిన పనులు జాబితా, ప్రస్తుతం జరుగుతున్న పనులు జాబితా,నూతనంగా చేపట్టబోవు పనులు ఎంపిక, తదితర అంశాలపై ఆ గ్రామ సభలలో గుర్తిస్తామన్నారు. అలాగే ఉజ్వల పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి మహిళ గ్యాస్ కనెక్షన్ కోసం ఆ సభలలో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. పంచాయతీరాజ్ ఏఈ రామ్మోహన్, ఏపిఎం వసంతరావు, ఏవో రమణారావు, పంచాయతీ కార్యదర్శిలు శ్రీనివాస్, నరేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి - గుడివాడ : ఆటోనగర్లో ప్రమాదవశాత్తూ గాయపడిన వ్యక్తికి ది కష్ణాజిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) గుడివాడ ఆటోనగర్ కమిటీ ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అంద జేశారు. గురువారం సిఐటియు పట్టణ కార్యదర్శి టి లక్ష్మణరావు మాట్లాడుతూ ఆటోనగర్ 5వ రోడ్ లో తాత కిరణ్ పనిచేస్తూ ఉండగా ప్రమాదవశాత్తు బల్ల మీద నుండి కింద పడగా ఎడమ చేయి మణికట్టు విరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు అబ్దుల్ అమీద్ అలియాస్ అమీర్, యూనియన్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దుస్, నాయకులు బొబ్బర పల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

చెక్కును అందిస్తున్న దృశ్యం

అదనపు బాధ్యతలను తొలగించాలి

ప్రజాశక్తి - గంపలగూడెం : ఇటీవల నూతన ప్రభుత్వం వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లకు అదనంగా, అప్పగించిన బాధ్యతలను వెనక్కి తీసుకోవాలని గంపలగూడెం మండల ఆ శాఖ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒ ఎం.చెన్నయ్యకు గురువారం వినతిపత్రం సమర్పించింది. ఇప్పటికే ఉన్న బాధ్యతలు సరిపోనట్టు అదనంగా పాఠశాలల్లో బాలికల బాత్రూంలను సైతం ఫొటోలు తీసి పెట్టాలన్నది హాస్యాస్పదంగా ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి, ఇచ్చిన ఈ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని ఆ వినతిపత్రంలో సంఘం వివరించింది.

సైన్స్ పరిశోధనలకు ప్రోత్సాహం లేదు : జెవివి

ప్రజాశక్తి - తిరువూరు : ప్రపంచ వ్యాప్తంగా పాలక ఆయా దేశాల ప్రభుత్వాలు సైన్స్ పరిశోధనలకు తగినంత ప్రోత్సాహం, ప్రచారం కల్పించక పోవడంతో సైన్స్ ఫలాలు సామాన్యులకు సక్రమంగా అందడం లేదని జనవిజ్ఞానవేదిక (జెవివి) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ అన్నారు. సైన్స్ పరిశోధనలకు జన విజ్ఞాన వేదిక విస్తృత ప్రచారం కల్పించి సైన్స్ పరిశోధనల పట్ల సామాన్యులకు మరింత ఆసక్తి పెంచేందుకు కృషి చేస్తుందన్నారు. బుధవారం రాత్రి తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన తిరువూరు మండల జెవివి వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వైద్యం ఖరీదు అవడంతో ప్రజలకు మరొక మార్గం లేక మూఢ నమ్మకాలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. జెవివి వంటి సంస్థలు బలోపేతం అయితేనే సైన్స్ ఫలాలు సామాన్యులకు త్వరగా అందడానికి తగిన కృషి జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.హరికృష్ణ, నాయకులు ఎం.రాంప్రదీప్, కె.పాపారావు, డి.సుదర్శన్, ఎం.సుధాకర్, ఎస్.జగన్మోహన్ రావు, సురేంద్ర నాథ్, ఏసు పాదం తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం వాయిదా

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :
మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో పలు వేలంపాటలను, టెండర్లను వాయిదా వేసినట్లు దేవస్థాన ఇఒ శిరపరపు హేమలతదేవి తెలిపారు. కొబ్బరి చిప్పలు పోగుచేసుకొనే లైసెన్సు, తులసీ-పూలు అమ్ముకొను లైసెన్సులకు '2'వ సారి, కూల్ డ్రింక్స్, పటాలు, బొమ్మలు అమ్ముకొనేందుకు, కొబ్బరి కాయలు, కిరణా సామాగ్రి అమ్ముకొను లైసెన్సులకు 2వ సారి రి-ఆక్షన్, టెంటు హౌస్ - పొంగల్ షెడ్ నడుపుకొను లైసెన్సుకు 3వసారి రీ-ఆక్షన్, తలనీలాలు పోగుచేసుకొను లైసెన్సుకు 5వసారి రీ-ఆక్షన్ గురువారం ఉదయం దేవస్థాన కార్యాలయంలో, దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్తు అధ్వర్యంలో దేవదాయ శాఖ నందిగామ డివిజన్ తనిఖీదారు పి.ఫణి కుమార్ పర్యవేక్షణలో 1 సంవత్సరం కాలపరిమితికి నడుపుకొనేందుకు సీల్డు టెండరు-కం-బహిరంగ వేలం పాటలు, ఇ-టెండర్లు నిర్వహించగా ధరావతు చెల్లించుటకు ఎవరు ముందుకు రాని కారణంచేత సదరు లైసెన్సులకు వేలం పాటలు వాయిదా వేసినట్లు ఇఒ తెలిపారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కంచికచర్ల : కృష్ణ వెన్నెల మహిళా సంఘం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మీకు తెలుసా కార్యక్రమం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని సంస్థ ప్రతినిధి పి.సుబ్బారెడ్డి అన్నారు. హెచ్ఐవి ఎలా వస్తుంది? రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వివిధ అంశాల గురించి ఆయన తెలిపారు. హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్నచూపు చూడకుండా సమాజంలో కలిసిమెలిసి జీవించేలా సహకరించాలని కోరారు. సుఖ వ్యాధుల వివరాలను

తెలిపారు. 2017 ఎయిడ్స్ యాక్టివ్ గురించి కూడా వివరించారు. టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి కూడా తెలిరపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ షిబా, ప్రాజెక్టు మేనేజరు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక అనారోగ్యంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : వాసవ్య మహిళా మండలి విజయవాడ వారు ది లైవ్ లవ్ లాఫ్ ఫౌండేషన్, సికె బిర్లా గ్రూప్ సహకారంతో కమ్యూనిటీ మెంటల్ హెల్త్ ప్రోగ్రాం ఇబ్రహీంపట్నం మండలంలో సాంత్వన ప్రాజెక్టు చేపట్టారు. ప్రాజెక్టు కార్యక్రమాల్లో భాగంగా కొండపల్లి పరిధిలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మానసిక ఆరోగ్యం పట్ల ఆశా వర్కర్లకు, ఎఎన్ఎంలకు సిబ్బందికి కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్‌ను ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించారు. మానసిక ఆరోగ్యం అంటే ఏమిటి, మానసిక అనారోగ్యానికి కారణాలు మానసిక అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నవారికి ఎటువంటి సహాయం అందించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. మానసిక అనారోగ్యం వచ్చిన వారికి గవర్నమెంట్ వైద్యం అందేలా ఎటువంటి చర్యలు తీసుకోవాలి, చిన్నపాటి ఒత్తిళ్ళను ఏ విధంగా ఎదుర్కోవాలి అని సూచించారు. ఈ

అవగాహన కార్యక్రమంలో సిబ్బంది

కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ భూక్య విజయ్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ బి.విజయ్ కుమార్, సాంత్వన ప్రాజెక్టు కోఆర్డినేటర్ కేశవ, ఎఎన్ఎంలు ఆశాలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చిల్లకల్లు ఎస్ఐగా సూర్య శ్రీనివాస్

జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా టి.సూర్య శ్రీనివాస్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు చిల్లకల్లు ఎస్ఐగా పనిచేసిన వి.సతీష్ కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. పెడన పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఉన్న సూర్య శ్రీనివాస్ చిల్లకల్లు బదిలీపై వచ్చారు.

చిరంజీవి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - గంపలగూడెం : స్థానిక తోట మూల విగ్రహాల సెంటర్లో చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మండల వ్యాప్తంగా సంఘ అభిమాన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.
కంచికచర్ల : సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు కంచికచర్ల మండలంలో గురువారం నిర్వహించారు. చిరంజీవి అభిమాన సంఘాలు, చిరంజీవి యువత ఆధ్వర్యంలో స్థానిక భావన సెంటర్‌లో చిరంజీవి 68వ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. పట్టణ వైసిపి అధ్యక్షుడు, గ్రామ ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు కట్ చేశారు.

వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - తిరువూరు : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా తిరువూరు గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు వక్తృత్వ పోటీ నిర్వహించారు. ఈ పోటీలో నాగార్జున స్కూల్ విద్యార్థులు 16 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతి ఎం.వీక్షిత, ద్వితీయ బహుమతి టి.హన్సిక, తృతీయ బహుమతి వి.కావ్యశ్రీ వల్లిలకు గ్రంథాలయ ప్రథమ శ్రేణి గ్రంథాలయాధికారి పద్మావతి అందజేశారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - భవానీపురం :
సుజనా ఫౌండేషన్, షేర్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 16న పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) ప్రారంభించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభిస్తుంది. నెల రోజులపాటు నిరంతరాయంగా కొనసాగనున్న ఈ ఉచిత మెగా వైద్య శిబిరాల్లో భాగంగా భవానీపురం ఎన్డీయే కార్యాలయంలో గురువారం పశ్చిమ ప్రజలు స్థానికులు భారీ సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రముఖ వైద్య నిపుణులు గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ ఎంఎస్ఎఫ్ఆర్‌సిఎస్ (బ్రిటన్) డాక్టర్ సి.ఎల్. వెంకట్రావు ఈ వైద్య శిబిరంలో తమ సేవలను అందిస్తున్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

జగ్గయ్యపేట: పట్టణంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌కు జగ్గయ్యపేట పట్టణానికి చెందిన మాజీ వార్డ్ కౌన్సిలర్ కంచరకుంట్ల శ్రీనివాసరెడ్డి, నీరజ కుమారుడైన కంచరకుంట్ల రాహుల్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా అన్న క్యాంటీన్ (ట్రస్టు)కు రూ.10వేలు తాతయ్య చేతుల మీదుగా నిర్వాహకులైన మైనేని రాధాకృష్ణకు అందజేశారు.

నేడు గ్రామసభ

జగ్గయ్యపేట: పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి కమీషనర్ ఆదేశాల మేరకు మండలంలోని 19 గ్రామ పంచాయతీలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024-25 సంవత్సరానికి పనుల గుర్తింపు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి ఎం.రమేష్ బాబు తెలిపారు. జిల్లా కలెక్టర్ జి.సృజన చిల్లకల్లు గ్రామ పంచాయతీ గ్రామ సభకు హాజరు కానున్నారని తెలిపారు. ఈ గ్రామ సభలలో గ్రామంలో వివిధ పనులకు సంబంధించి గ్రామ పంచాయతీ ఆమోదం పొందనున్నట్లు తెలిపారు. ఈ గ్రామ సభలలో మండల ప్రత్యేకఅధికారి జి.మహేశ్వరరావు, గ్రామ ప్రత్యేకాధికారులు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొంటారన్నారు.

కార్యక్రమంలో సామినేని, తదితరులు

మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు

జగ్గయ్యపేట : పట్టణ మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు జన్మదినం సందర్భంగా గురువారం పట్టణంలోని వారి స్వగృహంలో పట్టణ వైసిపి నాయకులతో ప్రభుత్వ మాజీవిప్ సామినేని ఉదయభాను కేక్ కట్ చేసి రాఘ వేంద్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మఠం శివాలయం పునర్నిర్మాణానికి విరాళం

జగ్గయ్యపేట: పట్టణ సమీపంలోని పాలేటివొడ్డున గల పంచాయతన క్షేత్రం మఠం శివాలయం పున:నిర్మాణ%శీ%నకు భక్తులు జల్లా నాగేశ్వరరావు కుమారుడు మెడికల్ ప్రాక్టీషనర్ జల్లా వెంకటేశ్వరరావు(జె వి ఆర్) గురువారం ఆలయ కమిటీ సభ్యులకు 1,11,116/ విరాళం అందచేశారు.

మొక్కలు నాటిన ఎంఎల్ఎ

జగ్గయ్యపేట: ప్లాంట్ ఫోర్ మదర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో గల జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు అవసరం

ఉంగుటూరులో మొక్కలు నాటుతున్న మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, తదితరులు

మోపిదేవిలో...

ప్రజాశక్తి- గుడ్లవల్లేరు : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం చాలా అవసరం అని ఎంపీడీవో డి కృష్ణవేణి కోరారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు పంచాయితీ ఆవరణలో ప్లాంట్ 4 మదర్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అధికారి, ఎంపీడీవో డి.కృష్ణవేణి గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు పళ్లెం నరసింహారావు, చాపరాల బాలాజీ, వల్లభనేని సుబ్బారావు,మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ వల్లభనేని వెంకటరావు, పోలవరం వెంకట్రావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు** : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం అత్యవసరమని తెలుగుదేశం పార్టీ ఉంగుటూరు మండల అధ్యక్షులు ఆరుమళ్ళ వెంకట కృష్ణారెడ్డి అన్నారు. గురువారం తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా మండలం లోని వెల్దిపాడు గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి తల్లి తన బిడ్డను ఏ విధమైన బాధ్యత తో పెంచి పోషిస్తుందో అదే విధంగా ఒక మొక్కను నాటి పెంచి పెద్ద చేసి ప్రజల ప్రాణాల రక్షణకై ఆక్సిజన్ అందించడానికి తోడ్పడాలని అన్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ లాం నాగేశ్వరరావు, టిడిపి మండల పార్టీ నాయకులు నెక్కలపూడి వెంకట రాజ మన్నార్, కడియాల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి- ఘంటసాల** : ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా ఘంటసాల జడ్పీ హై స్కూల్ లో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఘంటసాల సర్పంచ్ బి. వెంకటేశ్వరమ్మ, ఉప సర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్, ఎస్ఐ ప్రతాప్ రెడ్డి లు స్కూలు ఆవరణలో పలు రకాల మొక్కలను నాటి వాటి సంరక్షణ కు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి సంరక్షణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి మోపిదేవి** : వాతావరణ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఇంచార్జ్ ఎంపీపీ నడకుదిటి జనని కుమారి అన్నారు. గురువారం మోపిదేవి మండలం ఉత్తర చిరువోలు లంక గ్రామంలో తల్లికి వందనం (మదర్ ఫర్ ప్లాంట్స్) కార్యక్రమాన్ని ఇంచార్జ్ ఎంపీపీ జనని కుమారి ప్రారంభించారు. గ్రామంలోని అంగన్వాడి కేంద్రం వద్ద, ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధన్ రావు, ఉపాధ్యాయులు గురవయ్య, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు

పాముకాటుకు కౌలు రైతు మృతి

మృతి చెందిన కందుకూరి రాజు

ప్రజాశక్తి-ఉయ్యూరు : పెదఓగిరాలలో గురువారం పాము కాటుకు గురై కౌలురైతు మృతి చెందాడు. చినఓగిరాలకు చెందిన కందుకూరి రాజు (35) పెదఓగిరాలకు చెందిన బొమ్మారెడ్డి నాగేశ్వరరెడ్డికి చెందిన 2 ఎకరాల మెట్టపొలం కౌలుకు తీసుకుని పసుపు, క్యాబేజి పండిస్తున్నాడు. ఉదయం పంటకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లి అక్కడ ఉన్న ప్లాస్టిక్ ట్యూబ్ మడత విప్పుతుండగా అందులో ఉన్న పాము కాటు వేసింది. వెంటనే అతనిని పొరుగునఉన్న వారు అక్కడనుంచి ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకురాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మతునికి భార్య, ఐదుసంవత్సరాల కుమార్తె, రెండు సంవత్సరాల కుమారుడు ఉన్నారు.

కవుతరంలో 'పొలంబడి'

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : తక్కువ ఖర్చుతో ఆరోగ్య కరమైన పంటలను పండించాలని గుడ్లవల్లేరు మండల వ్యవసాయ అధికారి లోయ సునీల్ పేర్కొన్నారు. మండలంలోని కవుతరం గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవసరం మేరకు మాత్రమే ఎరువులు, పురుగు మందులు వినియోగించాలని రైతులకు సూచించారు. రైతులు పొలం పరిసరాల విశ్లేషణ చేసుకొని అవసరం మేరకు పురుగు మందులు ఉపయోగించాలని సూచించారు. అనంతరం మండల పరిధిలో జరుగుతున్న ఈ పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. రైతులందరూ సెప్టెంబర్ 15వ తేదీలోగా ఈ పంట నమోదు ప్రతి ఒక్క రైతు నమోదు చేయించుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రైతులు , తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్టార్టప్ కంపెనీలుగా అవతరించగల ఆవిష్కరణలను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా నీతి అయోగ్ మద్దతు సంస్థ మైటీ బ్రైడ్ 2.0 పథకం ద్వారా ఈ నెల 13, 14 వ తేదీలలో విజయవాడలోని స్టెల్లా కళాశాలలో నిర్వహించిన హ్యాకథాన్‌లో పాల్గొన్న తమ విద్యార్థులు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారని స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్. బి. కరుణ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల తతీయ సంవత్సరం విద్యార్థులు కె. రాఘవేంద్ర కార్తీక్, ఎ. షణ్ముఖ శ్రీనివాస్‌లు ఆక్వా సాగుపై దష్టి సారించి జలవాయు సంస్థ పేరుతో అభివద్ధి చేసిన ఆటో డి-ఆక్సీ టెక్ ప్రాజెక్టుకు అర్హత పొంది లక్ష రూపాయల అవార్డు ప్రశంసా పత్రాలను అందుకున్నారన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సర్టిఫికేట్ లను ప్రదానం చేశారు. ఎస్.ఆర్.జి.ఈ.సి. ఇన్నోవేషన్ అండ్ ఇన్క్యుబేషన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. మహేష్ బాబు, డాక్టర్ కె. అశోక్ రెడ్డి విద్యార్థులకు శిక్షణనిచ్చి మార్గదర్శకత్వం వహించారు. అవార్డు పొందిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి. కోదండరామరావు, డాక్టర్ ఎం. ఆర్. సి. హెచ్. శాస్త్రి, యాజమాన్య సలహాదారులు డాక్టర్ పి.రవీంద్ర బాబు, ఏ.ఐ.డి.ఎస్. విభాగాధిపతి డాక్టర్ ఎస్. నారాయణ తదితరులు అభినందించారు.

విరాళాలు సేకరించిన కెటిఆర్ కళాశాల విద్యార్థినిలు

అన్న క్యాంటీన్‌కు విరాళం

ప్రజాశక్తి-గుడివాడ : అన్నం పరబ్రహ్మ స్వరూపమని కెటిఆర్ మహిళా కళాశాల కార్యదర్శి పర్వతనేని నిర్మల, ప్రిన్సిపల్ ఎం.సుష్మలు అన్నారు. గురువారం స్థానిక కెటిఆర్ కళాశాల నుండి విద్యార్థినులు అన్న క్యాంటీన్‌కు సహాయ సహకారాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు స్పందించిన కళాశాల విద్యార్థినిలు రూ.10000లను క్యాంటీన్ నిరాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

చిరంజీవి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక ది నెక్స్ట్ థియేటర్‌లో జిరంజీవి జిల్లా యువత అధ్యక్షుడు మేకా మురళీ ఆధ్వర్యంలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గోకరకొండ బలరామ్ కేక్‌ను కట్ చేసి అభిమానులకు అందజేసారు. థియేటర్ యజమాని తుమ్మల రాము, చిరంజీవి ఫ్యాన్స్ నాయకులు కొయిలాపు రాము, నల్లగంచు రాంబాబు, పండ్రాజు సాంబశివరావు పాల్గొన్నారు.అలాగే కోయిలాపు రాము యూత్ ఆధ్వర్యంలో కూడా వేడుకలు నిర్వహించారు.

వైద్యురాలిపై హత్యాచారం దారుణం : సిపిఎం

సమావేశంలో మాట్లాడుతున్న వై నరసింహారావు

ప్రజాశక్తి-చల్లపల్లి : మహిళలకు రక్షణ కరువైందని సిపిఎంజిల్లా కార్యదర్శి వై. నరసింహారావు విచారం వ్యక్తం చేశారు. బుధవారం స్థానికశ్రామిక గుంటూరు బాపనయ్య భవనంలో మండల పార్టీ శాఖ కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం అరాచరపాలన కొనసాగుతుందని విమర్శించారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో కోల్‌కతా ఆసుపత్రిలో వైద్యురాలిపై జరిగిన దారుణం ఇందుకు నిదర్శనం అన్నారు. బాంగ్లాదేశ్‌లో విధ్వంసక పాలన వల్లే అధ్యక్షురాలు హసీనా రాజీనామా చేసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రిజర్వేషన్ల వ్యతిరేక విధానాల అమలు చేయటం వల్లనే అక్కడి ప్రజలు రోడ్డెక్కారన్నారు క్కారన్నారు. భూస్వాములు వ్యవసాయ భూములను కౌలకు ఇచ్చి వాణిజ్య, వ్యాపార రంగాలలో, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు కొనసాగిస్తున్నారని వివరించారు. బిజెపిని ఓడించేందుకు బిజెపి వ్యతిరేక పార్టీలతో కలిసి ఎన్నికల్లో కూటమిగా ఏర్పడ్డామని తెలిపారు. దివి సీమలో 66 మంది భూస్వాముల గుండాల దౌర్జన్యానికి అమరులయ్యారని గుర్తు చేశారు. గతంలో ఉన్న భూస్వాములలో కొద్దిగా మార్పు వచ్చిందే తప్ప భూస్వామ్య విధానం మారలేదని వివరించారు. మహమ్మద్ కరీముల్లా అధ్యక్షతన జరిగిన సమావేశం లో చల్లపల్లి మండల కార్యదర్శి యద్దనపూడి మధు, గ్రామ శాఖ కార్యదర్సులు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంలో అవకతవకలపై విచారించాలి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని రొయ్యూరు గ్రామంలో పునర్నిర్మాణం జరిగిన శ్రీ గంగా పార్వతీ సమేత సకలేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో అనేక అవకతవకలు జరిగాయని గ్రామస్తుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక సకలేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖ అనుమతి లేకుండా గ్రామంలో ఒక కమిటీగా కొంతమంది ఏర్పడి అక్రమంగా చందాలు వసూలు చేశారని, దేవాలయ నిర్మాణం కోసం వసూలు చేసిన చందా డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో తెలియాల్సి ఉందన్నారు. 2023వ సంవత్సరంలో రూపాయలు 75 లక్షలతో దేవాలయ నిర్మాణం చేపట్టామని అధికారులు శిలాఫలకం ఏర్పాటు చేసి తీరా చూస్తే 2024 వ సంవత్సరంలో ఆలయ నిర్మాణ కమిటీ అని ఒక కమిటీని ఏర్పాటు చేసి ఆ కమిటీ ఆధ్వర్యంలో దేవాలయ నిర్మాణానికి చందాలు వసూలు చేశారని ఆయన ఆరోపించారు. దీనితోపాటు దేవాలయంలో పాత ధ్వజస్తంభానికి ఉన్న ఇత్తడి అపహరణకు గురి అయిందని అనేకమార్లు దేవాలయ శాఖ అధికారిని సుపట్నా దేవికి ఫిర్యాదు చేసిన ఆమె పట్టించుకోలేదన్నారు. అక్రమాలను వెలికి తీసేందుకు ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

ఘనంగా చతుర్దశి వేడుకలు

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థాన మండపంలో సంకటహర చతుర్దశి వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా నిర్వహించిన లక్ష్మీ గణపతి హోమ పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం హోమగుండంలో పూర్ణాహుతిని సమర్పించారు. లోక కళ్యాణార్థమే దేవస్థానంలో సంకటహర చవితి రోజున శ్రీలక్ష్మీ గణపతి హోమ పూజలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో ప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్ శస్త్రచికిత్సలో కొత్త శకానికి నాంది

ప్రజాశక్తి- హెల్త్ యూనివర్సిటీ : రొమ్ము కేన్సర్ కోసం మొట్టమొదటి యూనివర్సల్ రోబోటిక్ అసిస్టెడ్ బ్రెస్ట్ సర్జరీని అపోలో కేన్సర్ సెంటర్ నిర్వహించినట్లు అపోలో క్యాన్సర్ సెంటర్ సర్జికల్ ఆంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. ఈ వినూత్న శస్త్రచికిత్స సాంకేతికత, ప్రత్యేకమైన ఖచ్చితత్వంతో ప్రయోజనాలను అందిస్తుందన్నారు. ఇది రొమ్ము క్యాన్సర్ చికిత్సలో కొత్త శకానికి నాంది పలుకుతుందని, వినూత్న శస్త్రచికిత్స గురించి డాక్టర్ గౌడ్ మాట్లాడుతూ, 'చంకలో కేవలం 3 సెం.మీ. చిన్న కోతను ఉపయోగించి, శస్త్రచికిత్స బృందం అధునాతన డాక్టర్ విన్సీ ఎక్స్‌ఐ ఆర్మ్ ద్వారా రొమ్ము ప్రాంతాన్ని యాక్సెస్ చేసిందన్నారు. ఈ ప్రక్రియ చనుమొన, ఐరోలాను విడిచిపెట్టడానికి అనుమతిస్తుందని, రోగులకు కాస్మెటిక్ ఫలితాలను గణనీయంగా మెరుగుపరుస్తుందని అన్నారు. యు-ఆర్ఎబిఎస్ టెక్నిక్ రొమ్ము క్యాన్సర్‌కు నివారణ విధానాన్ని అందించడమే కాకుండా, శస్త్రచికిత్స తర్వాత రోగులకు వారి శరీర ఇమేజ్‌ని నిలుపుకునేలా కూడా ఇది నిర్ధారిస్తుందని తెలిపారు.

ప్రమాదకర ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగరంలోని 5వ ట్రాఫిక్ సిఐ బి.బాల మురళీకృష్ణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకట రమణ ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలిసి ఫ్లై బ్రిడ్జ్, గీతా నగర్ కట్ట, నేతాజీ బ్రిడ్జి, వారధి చెక్ పోస్ట్ అను పాయింట్‌లలో యాక్సిడెంట్‌లు జరుగు బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, సదరు బ్లాక్ స్పాట్‌ల వద్ద ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లకు పలు సూచనలు చేసి, వారిలో అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వారు ఆదేశించారు. పెరుగుతున్న వాహనాలు, నిబంధనలు పాటించకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం తదితర కారణాలతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటూ పలువురు మృతిచెందుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. క్రమం తప్పకుండా చెకింగ్‌చేస్తూ, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణ చేస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని బాలమురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు.

మలబార్‌లో జెమ్ స్టోన్ ఫెస్టివల్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలో 'జెమ్ స్టోన్' జ్యువలరీ ఫెస్టివల్‌ను ప్రారంభించినట్లు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ జ్యువెలరీ ఛైర్మన్ ఎం.పి.అహ్మద్ తెలిపారు. వివాహాది, శుభకార్యాల సందర్భంగా ప్రత్యేక జ్యువలరీ ఆభరణాలను అందు బాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఫెస్టివల్ సందర్భం గా రత్నాభరణాలు, అన్ కట్ డైమండ్ తరుగుపై 25 శాతం తగ్గింపు ఉంటుందని అన్నారు. పోల్కి ఆభరణాలు స్టోన్స్‌పై 25 శాతం తగ్గింపు ఉంటుందని అన్నారు. మలబార్ గోల్డ్ అండ్ జ్యువలరీలో అన్ని రకాల ఆభరణాలపై ప్రత్యేక తగ్గింపు ఉంటుందని అన్నారు. వినియోగదారుల కోరిక మేరకు వారి అభిరుచి మేరకు ఆభరణాలను అందిస్తున్నారని అన్నారు.

పండ్లు పంపిణీ

జగ్గయ్యపేట : చిరంజీవి జన్మదినం సందర్భంగా జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే రామ్ రాజగోపాల్ (తాతయ్య) సోదరుడు శ్రీరామ్ చిన్నబాబు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది పసుపులేటి సత్య శ్రీనివాస్, మునిసిపల్ కౌన్సిలర్ నూకల సాంబ, తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా కరాటే పోటీల్లో

'శారదా' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆల్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ -2024 పోటీల్లో మొగల్రాజపురంలోని శారద విద్యాసంస్థలు విద్యార్థి ప్రతిభ కనపరచి ప్రథమ స్థానాన్ని సాధించారని శారద విద్యాసంస్థలు ఛైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు తెలిపారు. మొగల్రాజపురంలోని సంస్థ కార్యాలయం నంది విద్యార్థి పి.నితీశ్ నాగసాయి అభినందన సభ గురువారం కళాశాల ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ తమ విద్యా సంస్థ విద్యతో పాటు క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంది అన్నారు. ఈ నెల 18., 19 తేదీలలో హర్యానా రాష్ట్రంలో జరిగిన ఆల్ ఇండియా కరాటే చాంపియన్షిప్ పోటీలలో నితిన్ నాగసాయి ప్రథమ స్థానం సాధించి క్రీడా ప్రతిభను కనపరచారని అన్నారు. త్వరలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ కనపరచాలని అన్నారు. శారద విద్యాసంస్థలు మేనేజింగ్ డైరెక్టర్ వై.శారద దేవి మాట్లాడుతూ తమ విద్యాసంస్థ విద్యార్థులు ప్రతి ఏటా జాతీయస్థాయిలో జరిగే పోటీ పరీక్షల్లో కూడా విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధిస్తున్నారని అన్నారు. తమ విజయాలకు కారణం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి వల్లనే మంచి ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి నితీశ్‌ని కళాశాల జనరల్ మేనేజర్ జి.వి.రావు అభినందించారు.

పోలీసుల అదుపులో లారీ క్లీనర్

ప్రజాశక్తి - నందిగామ : రూ.18,52,000 నగదుతో పరారైన లారీ క్లీనర్‌ను నందిగామ పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఏసిపి రవి కిరణ్ మాట్లాడుతూ మైలవరం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ షేక్ ఖయిమ్, మండలం సోమవారం గ్రామానికి చెందిన లారీ క్లీనర్ పల్లె పోగు కోటేశ్వరరావు కలిసి, ఏపి 16 టిఇ 2977 నెంబర్ గల లారీ లో ఛత్తీస్ గడ్ రాష్ట్రం బిలాస్పూర్ మిర్చి లోడు ఎత్తుకొని దిగుమతి చేశారు. 300 బస్తాలు అమ్మగా వచ్చిన డబ్బులతో తిరిగి వస్తుండగా లారీ క్లీనర్ కోటేశ్వరరావు పని ఉందని పాల్వంచలో దిగి పోయాడు. జొన్నలగడ్డ చెక్‌పోస్ట్ వద్ద లారీ డ్రైవర్ నగదును చూసుకోగా లేకపోయేసరికి లారీ క్లీనర్‌పై అనుమానంతో ఫిర్యాదు చేశారు. నందిగామ పట్టణానికి ఆటోలో వస్తున్న క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సిఐ వై.వి.ఎల్ నాయుడు, ఎస్ఐ పండు దొరలను ఏసిపి రవికిరణ్ అభినందించారు.

వివరాలు తెలుపుతున్న పోలీసులు

పత్తి పంటలో కలుపుతో అదనపు ఖర్చు

ప్రజాశక్తి - వత్సవాయి : ఇటీవల పది రోజులకు పైగా కురిసిన వర్షాలకు పత్తి పంటలో విపరీతమైన కలుపు పెరిగింది అసలే పెట్టుబడులకు అర కొరగా చేతిలో ఉంచుకున్న నగదులో సగానికి పైగా కలుపు తీయడానికే ఖర్చు పెట్టాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి తోటల్లో పెరిగిన కలుపు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. రోజు విడిచి రోజు వర్షం పడుతుండటంతో కలుపు తీయకుండా, మందులు వేయకుండా, మందు కట్టలు చల్లకుండా ఉంచాల్సి వస్తోం దన్నారు. వర్షాలకు పత్తి ఎర్రబారకుండా రైతులు యూరియాను చల్లారు. దీంతో భూమిలో బలం పెరిగి గతంలో ఎన్నడూ లేనంతగా కలుపు పెరిగింది. ఎకరం పొలంలో కలుపు మొక్కలను తొలగించడానికి 20 నుంచి 30 మందికి పైగా కూలీలు పడుతున్నారు. రైతులంతా ఒకేసారి కలుపు పనులు మొదలుపెట్టడంతో కూలీలకు గిరాకీ ఏర్పడింది. గ్రామాలలో కూలీలకు గిరాకీ ఏర్పడటంతో కలుపు తీసేందుకు రైతులు పక్క గ్రామాల నుంచి కూలీలను తెప్పించుకుంటున్నారు. ప్రత్యేకంగా ట్రాక్టర్ ఆటోలను ఏర్పాట్లు చేసుకొని దూర ప్రాంతాల నుంచి ఉదయం తీసుకువచ్చి సాయంత్రం మళ్ళీ వారి గ్రామాలకు పంపిస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పనిచేస్తే మనిషికి 200 కూలి. అదే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తే రూ.300లు కూలి తీసుకుంటున్నారు. మరి కొంతమంది పొలాన్ని బట్టి కూలీలు కాంట్రాక్ట్‌గా మాట్లాడుకొని కలుపు తీస్తున్నారు. పల్లపు భూముల్లో ఇంకా ఎక్కువ కలుపు సమస్యగా ఉందని రైతులు తెలుపుతున్నారు. మందు కలిపి పిచికారి చేసిన ఫలితం లేకుండా పోయింది. కలుపు కూలిఖర్చులు ఏడాదిఅదనపు ఖర్చులయ్యాయని రైతులు వాపోతున్నారు.

ఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ప్రజాశక్తి - నందిగామ : ఒక ఎస్ఐ నలుగురు కానిస్టేబుల్స్‌ను విజయవాడ కమిషనర్ సస్పెండ్ చేశారు. నందిగామ పోలీస్ స్టేషన్ క్రైం.నెం.313/2024 303(2) బిఎన్ఎస్ కేసులో ముద్దాయి పల్లెపోగు కోటేశ్వరరావుని గురువారం అదుపులోకి తీసుకున్నారు. ముద్దాయి ఇచ్చిన తదుపరి స్టేట్ మెంట్‌పై, పైకేసులో 6 లక్షల నగదును ఐయుదురుగు ఏ.ఆర్ (ఏ.ఎస్సై బి.రుద్రరాజు, కానిస్టేబుల్ యం.అరుణ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ కె.నాగబాబు), సివిల్ పోలీస్ (కానిస్టేబుళ్ళు శివ, సజన్) సిబ్బంది దుర్వినియోగం చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. కేసు దర్యాప్తులో భాగంగా అయిదుగురు సిబ్బందిని కూడా కేసులో ముద్దాయిలుగా చేర్చారు. విజయవాడ సిపి అయిదుగురు సిబ్బందిని విధుల నుండి సస్పెండ్ చేశారు. నందిగామ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న శివ, సృజన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వైవియల్ నాయుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీతారామారావు

సిఐని కలిసిన సబ్ జైల్ సూపరింటెండెంట్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ వైవియల్ నాయుడుని సబ్‌జైలు సూపరింటెండెంట్ చదల సీతారామారావు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి పలు విషయాలు చర్చించారు.

ట్రాఫిక్ ఎస్ఐగా సురేష్ బాధ్యతలు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ ట్రాఫిక్ ఎస్ఐగా నరేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ నందిగామ పట్టణంలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు. పట్టణంలో వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. గాంధీ సెంటర్ నుండి రథం సెంటర్ వరకు ద్విచక్ర వాహనదారులు, ద్విచక్ర వాహనాలు రోడ్డుకు ఇరువైపులా నిలుపుదల చేసి ట్రాఫిక్ ఇబ్బందులు గురయ్యేలా చేయకూడదని వారికి కేటాయించిన స్థలంలోనే ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకోవాలని కోరారు. పట్టణంలోని హోటల్లు ఎదురుగా ఒక పద్ధతి ప్రకారం ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసేలా హోటల్ యజమానులు చూసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్ పాటించక పోతే జరిమానాలు విధిస్తామని అన్నారు. మైనర్లు, త్రిబుల్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడుపుట లాంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ట్రాఫిక్ సమస్య వచ్చిన తమకు నేరుగా సమాచారం ఇవ్వొచ్చని ఆయన తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. అటువంటి వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు

శామ్‌సంగ్ ఎఐ వాషింగ్ మెషిన్ విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్, ఈ సంవత్సరం పండుగ సీజన్‌కు ముందు 10 వాషింగ్ మెషీన్‌లను పరిచయం చేయబోతున్నట్లు సంస్థ ప్రతినిధి కె.రాజేష్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. కంపెనీ ఈ నెలాఖరులో విడుదల చేయబోతున్న రాబోయే ఫ్రంట్ లోడ్ పి పవర్ద్ వాషింగ్ మెషీన్ కోసం ఇటీవల టీజర్‌ను విడుదల చేసిందన్నారు. కంపెనీ హైఎండ్ స్మోక్ ఏఐ సిరీస్ గృహోపకరణాలు, మెరుగైన కనెక్టివిటీని, స్మార్ట్ హోమ్ అనుభవాన్ని మార్చడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. స్నేహపూర్వక పరిష్కారాలతో అనుకూలమైన అనుభవాలను అందిస్తాయని తెలిపారు. ఈ శ్రేణి శామ్‌సంగ్ ఇండియా మొత్తం వాషింగ్ మెషీన్ల పోర్ట్‌ఫోలియోను గణనీయంగా విస్తరింప జేస్తుందన్నారు. మార్కెట్‌లో గేమ్ ఛేంజర్‌గా ఉంటుందని భావిస్తున్నామని తెలిపారు.

గుంతను పూడ్చరూ...

ప్రజాశక్తి - వన్‌టౌన్ : భవానీపురం చర్చి సెంటర్ నుండి స్వాతి థియేటర్ వైపుకు వెళ్లే ప్రధాన రహదారిపై గుంత ఏర్పడి ప్రమాదభరితంగా తయారైంది. వివరాల్లోకి వెళ్తే క్రాంబ్వే రోడ్డు ప్రధాన రహదారిలోని రామరాజు కాటన్ షోరూం సమీపంలో రోడ్డు కుంగిపోయి గుంత ఏర్పడింది. దీంతో రోడ్డుపై పడిన గుంత ప్రాంతంలో ప్రమాదకర ప్రాంతంగా గుర్తించేందుకు ఓ కర్రకు గుడ్డను ఉంచారు. నిత్యం రద్దీగా ఉండే క్రాంబ్వే రోడ్డులో గుంత పడటంతో వాహనదారులు భయం భయంగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. 15 రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకున్న నాథుడు లేరని వాపోతున్నారు. ఇప్పటికైనా స్థానిక కార్పొరేటర్ దీనిపై దృష్టి సారించి రోడ్డుపై పడిన గుంతను పూడ్చి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

క్రాంబ్వే రోడ్డులో పడిన గుంతలో గుడ్డ చుట్టి వున్న కర్ర